క్లుప్తంగా

రామతీర్థంలో పారిశుధ్య పనులు



రామతీర్థం ప్రధాన రహదారిలో పారిశుధ్య పనులు చేపడుతున్న పారిశుధ్య కార్మికులు

నెల్లిమర్ల: రామతీర్థం పుణ్యక్షేత్రంలో నెల్లిమర్ల నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులు సేవలందించారు. శివరాత్రి జాతర సందర్భంగా ఆలయ సమీపంలోను, బోడికొండ దగ్గర, ప్రధాన రహదారిలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీప్రసాద్ ఆధ్వర్యంలో పదిమంది కార్మికులు రెండ్రోజులుగా పనులు చేస్తున్నారు. అలాగే తాగునీటి వనరుల వద్ద క్లోరినేషన్ చేపట్టారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



ఏపీఎస్పీ బెటాలియన్ వద్ద ఉన్న శివాలయంలో శివలింగానికి పాలాభిషేకం చేస్తున్న అర్చకులు

డెంకాడ: మహా శివరాత్రి నేపథ్యంలో శివాలయాలు హరహర మహదేవ నామస్మరణతో మార్మోగాయి. చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ వద్ద ఉన్న శివాలయంతో పాటు మండలంలోని డెంకాడ, గుణుపూరుపేట, రఘుమండ, అక్కివరం, తదితర గ్రామాల్లోని శివాలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో శివాలయాలు భక్తజనంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

అన్నదానంతోనే ముక్తి



ప్రసాదం వడ్డిస్తున్న శంకర్‌రెడ్డి, తదితరులు

విజయనగరం టౌన్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో కొలువైన మహాశివునికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో సుమారు నాలుగువేల మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఏటా క్రమం తప్పకుండా మహా శివరాత్రి మరుచటి రోజున అన్నదానం నిర్వహిస్తామన్నారు. అన్నదానంతోనే ముక్తి కలుగుతుందని చెప్పారు. ఆలయ అభివృద్ధికి దాతలు మరింత ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాస్, కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా పరదేశమ్మ ఉత్సవం

జామి: మండలంలోని తాండ్రంగిలో గ్రామదేవత పరదేశమ్మ ఉత్సవాన్ని గ్రామస్తులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఏటా శివరాత్రి మరుసటి రోజును ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామపెద్దలు తెలిపారు. అమ్మవారిని గ్రామస్తులు ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామపెద్దల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

జూనియర్ కళాశాలలో స్కిల్ హబ్

- నిరుద్యోగ యువతకు నేటి నుంచి శిక్షణ

గజపతినగరం: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిరుద్యోగ యువత కోసం ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ప్రిన్సిపాల్ సీహెచ్ విజయకుమారి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ ఎస్.గోవిందరావు పర్యవేక్షణలో సోమవారం ప్రారంభం కానున్న శిక్షణ మూడు నెలల పాటు కొనసాగనుందని చెప్పారు. పదోతరగతి ఉత్తీర్ణులైన 18 నుంచి 30 ఏళ్ల లోపు నిరుద్యోగ, యువతీ యువకులకు అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులపై శిక్షణ ఉంటుందని వివరించారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారితో పాటు నూతనంగా చేరాలనుకున్న వారికి కూడా శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మరిన్ని వివరాలకు 8121016785, 8688978267 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వైభవంగా ప్రతిష్ఠా కార్యక్రమాలు

రాజాం: మండలంలో మొగిలివలస గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయ ప్రతిష్ఠా కార్యక్రమాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిష్ఠించనున్న విగ్రహాలకు జలాధివాసాలు, క్షీరాభిషేకాలు నిర్వహించారు. మొగిలివలస గ్రామంతో పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

నగరంలో పందుల బెడద

- ఖాళీ స్థలాలే వాటి స్థావరాలు
- ప్రబలుతున్న అంటురోగాలు



ప్రదీప్‌నగర్‌లో పందుల విహారం

విజయనగరం అర్బన్: నగరంలో పందుల సంచారం రోజురోజుకూ పెరుగుతోంది. మురికి ప్రాంతాలతో పాటు అభివృద్ధివాడల్లో పందుల నిర్మూలన మున్సిపల్ కార్పొరేషన్‌కి తలనొప్పిగా మారింది. బడ్జెట్‌లో రూ.లక్షలు కేటాయించినా పందులను పూర్తిస్థాయిలో నిరోధించలేకపోతున్నారు. నగరంలోని 50 డివిజన్‌లలో దాదాపు 25 ప్రాంతాల్లో అభివృద్ధి కాలనీలున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఇంటి నిర్మాణాలు చేయకపోవడంతో ఖాళీగా ఉన్న స్థలాలను పందులు తమ ఆవాసాలుగా మార్చుకుంటున్నాయి. ప్రతిరోజూ సాయంత్రానికి ఆయా ప్రాంతాలకు చేరుకుని రాత్రంతా అక్కడే ఉండి, తెల్లవారుజామున కాలనీల్లోని ఇళ్లల్లో ప్రవేశించి ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. వీధుల్లో చిన్న పిల్లలు తిరగడానికి భయపడుతున్నారు. పందులు, కుక్కల కొట్లాటలో ప్రతి రోజూ కాలనీ స్థావరాల్లో పందులు చనిపోతున్నాయి. వాటి కళేబరాలు తొలగించడం మున్సిపల్ సిబ్బందికి దినచర్యలా మారింది. పందుల స్వైరవిహారం వల్ల అంటురోగాలు కూడా ప్రబలుతున్నాయి. అభివృద్ధి ప్రాంతాలైన ప్రదీప్‌నగర్, పీఎస్ఆర్ కాలనీ, ఉడాకాలనీలు, బీసీ కాలనీ కామాక్షినగర్, కేఎల్‌పురం, పద్మావతినగర్, దాసన్నపేట, అరుంధతి నగర్, కణపాక, వివేకానందకాలనీ, తదితర కాలనీల్లో పందుల బెడద ఎక్కువగా ఉందని ఆయా ప్రాంతాల ప్రజలు చెబుతున్నారు. ఇదిలా ఉంటే పందుల పెంపకందారులను గుర్తించి అవగాహన కల్పిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు తెలిపారు. కాలనీల్లో ఖాళీగా ఉన్న స్థలాల్లో పందులు చొరబడకుండా ప్రహరీలను నిర్మించుకోవాలని ఖాళీ స్థలాల యజమానులను కోరారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న అప్పారావు

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు

విజయనగరం ఫోర్ట్: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. పట్టణంలోని సుంకరివీధిలో షెడ్యూల్ కులాల బాలికల వసతి గృహాలను ఆదివారం ఆయన సందర్శించారు. బాలికల వసతి గృహాల్లో పూర్తి స్థాయి మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. త్వరలో జరిగే ఫైనల్ పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలని సూచించారు. ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలన్నారు. చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని తెలిపారు. సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలని చెప్పారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వసతి గృహంలోకి విద్యార్థుల కుటుంబ సభ్యులు తప్ప ఇతరులను లోపలికి అనుమతించవద్దని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా సంక్షేమ అధికారి రామానందం, వసతి సంక్షేమ అధికారులు రాధామణి, నాగమణి పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



ఛత్రపతి శివాజీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న యువత

విజయనగరం: పోరాట స్ఫూర్తి విషయంలో ఛత్రపతి శివాజీ మహరాజ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని వాట్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు నేటిపల్లి పృథ్వి పిలుపునిచ్చారు. నగరంలోని దాసన్నపేట బాలుర వసతిగృహంలో సేవా సంస్థ ఆధ్వర్యంలో శివాజీ జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శివాజీ మహరాజ్ నుంచి యుద్ధ నైపుణ్యం, పోరాట పటిమ, మహిళలను గౌరవించడం వంటివి ఈ నాటి యువత అలవర్చుకోవాలని అన్నారు. యువతకు ఆదర్శప్రాయుడైన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని విజయనగరంలో ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఆయనను స్ఫూర్తిగా తీసుకుని భారతదేశ ఐక్యతకు పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మద్దిల సోంబాబు, యజ్జల చక్రవర్తి, బుడ్డేపు వెంకటేష్, దాసన్నపేట బీసీ హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

● కోడ్ ఎఫెక్ట్..



ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో నగరంలోని రాజకీయ పార్టీ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే గూడ్స్‌షెడ్ ప్రాంతంలో ఉన్న రాజశేఖరరెడ్డి విగ్రహానికి అధికారులు ముసుగు వేశారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

నాణ్యత లోపిస్తే చర్యలు

తెర్లాం: పెట్రోల్ విక్రయాలకు సంబంధించి కొలతల్లో తేడాలున్నా, నాణ్యత లోపించినా, అధిక ధరలకు విక్రయించినా చర్యలు తప్పవని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు అన్నారు. తెర్లాం జంక్షన్‌లో గల హిందూస్థాన్ పెట్రోలియం కంపెనీకి చెందిన పెట్రోల్ బంక్‌ను సీఎస్‌డీటీ గాడి భాస్కరరావుతో కలిసి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు పెట్రోల్ నాణ్యతను, ధరలను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ పెట్రోల్ నాణ్యత, కొలతల్లో ఎటువంటి తేడాలుండకూడదన్నారు.

సాహిత్యమే చరిత్రకు పునాది

రాజాం సిటీ: సాహిత్యమే చరిత్రకు ఆధారాలు అని సాహితీవేత్త డాక్టర్ దామోదర వెంకట సూర్యారావు అన్నారు. స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక 8వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విస్మృత కళింగాంధ్ర సాహితీ ప్రభ అనే గ్రంథాన్ని ఆవిష్కరించారు. అనంతరం దామోదర వెంకట సూర్యారావు మాట్లాడుతూ కనుమరుగైపోయిన కళింగాంధ్ర కవులు, రచయితల సాహిత్యాన్ని ఈ పుస్తకంలో పొందుపర్చడం జరిగిందన్నారు. ఇలాంటి సాహిత్య చరిత్రల ద్వారానే ఆయా ప్రాంతాల చరిత్ర బహిర్గతమవుతుందన్నారు. ప్రాంతీయ అస్తిత్వాన్ని నిలపాలంటే ఆ ప్రాంతంలోని సాహిత్యాన్ని కూడా వెలికి తీయడం, వర్తమాన సాహిత్యాన్ని గ్రంథస్తం చేయాలని అన్నారు. అనంతరం రచయితల వేదిక సభ్యులు వెంకట సూర్యారావును సన్మానించారు. కార్యక్రమంలో వేదిక నిర్వాహకుడు గార రంగనాథం, డాక్టర్ కణుగుల సుధీర్, అట్టాడ అప్పనాయుడు, గంట్యాడ గౌరునాయుడు, తుర్లపాటి రాజేశ్వరి, రామవరపు వెంకటరమణమూర్తి, గార రవిప్రసాద్, సూర్యశైలజ, గార సీతారత్నం, పిల్లా తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఘటాల ఊరేగింపు

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాదిలో ఈ నెల 28న నిర్వహించనున్న 13 గ్రామాలకు చెందిన పాతపోలమ్మ, కొత్తపోలమ్మ, నూకాలమ్మ జాతరలకు సందర్భంగా అమ్మవారి ఘటాలకు ఆదివారం పూజలు చేసి ఊరేగించారు. పారాది, నారాయణప్పవలస, కాశిందొరవలస, భోజరాజపురం, తదితర గ్రామాల్లో ఘటాలకు పూజలు నిర్వహించగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రాజుపేటలో అమ్మవారి సంబరాలు

బొబ్బిలి రూరల్: మండలంలోని రాజుపేటలో దేశమ్మ తల్లి సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, న్యాయవాది రుంకాన ప్రసాద్, దిబ్బగుడ్డివలస సర్పంచ్ చింతల రామారావు, అల్లు త్రినాథ పాల్గొన్నారు.

సామూహిక రుద్రాభిషేకాలు

రాజాం: పట్టణంలో అమ్మవారి కాలనీలో ఉన్న సీతారామ మందిరంలో శనివారం రాత్రి మహాన్యాసపూరక రుద్రాభిషేకాలు నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా లింగోద్భవ కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా అఖండ దీపారాధన చేపట్టారు.

హోరాహోరీగా గుర్రాలు, ఎడ్ల పరుగు పోటీలు



లచ్చంపేట గ్రామంలో నిర్వహించిన పోటీల్లో దౌడు తీస్తున్న గుర్రం



చందులూరులో ఎడ్ల పరుగు పందెం పోటీలు

లక్కవరపుకోట: మండలంలోని లచ్చంపేట గ్రామంలో శ్రీవీరమాంబ సహిత గిరినాగేశ్వరస్వామి తీర్థం సందర్భంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన అంతర్ జిల్లాల గుర్రాలు, ఎడ్ల పరుగు పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీల్లో ఎల్.కోట మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గుమ్మడి సత్యనారాయణకు చెందిన జ్వాలా, సాయి విరాట్ గుర్రాలు మొదటి, రెండో స్థానాల్లో నిలిచాయి. తృతీయ స్థానంలో అలమండ శ్రీనురాజుకు చెందిన గుర్రం నిలిచాయి. పోటీల్లో మొదటి ఏడు స్థానాల్లో నిలిచిన గుర్రాలకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. అలాగే చందులూరు గ్రామంలో నిర్వహించిన ఎడ్ల పరుగు పోటీల్లో 11 జతల ఎద్దులు పాల్గొన్నాయి.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు

లక్కవరపుకోట: మండలంలోని చందులూరు గ్రామంలో ఎర్రాయమ్మ పేరంటాల తీర్థం సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమైంది. ఈ పోటీలను చందులూరు ఎంపీటీసీ యడ్ల కిశోర్‌కుమార్ ప్రారంభించారు. విజయనగరం జిల్లా నుంచి 38 జట్లు, విశాఖపట్నం జిల్లా నుంచి 5 జట్లు పోటీల్లో పాల్గొననున్నాయని నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్ విజేతగా నిలిచిన జట్టుకు రూ.10 వేలు, రన్నర్‌గా నిలిచిన జట్టుకు రూ.6వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.3వేలు చొప్పున నగదు బహుమతులు, ఉత్తమ బాట్స్‌మన్, బౌలర్, ఆల్ రౌండర్‌కు బహుమతులు అందజేస్తామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు యడ్ల సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

జీవామృతంతో పంటకు మేలు

రేగిడి: రసాయన ఎరువులకు బదులు జీవామృతాన్ని వినియోగించి పంట తెగుళ్లను సమర్థవంతంగా నివారించవచ్చని వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని చాటాయవలస గ్రామంలో అగ్నిఅస్త్రం తయారీ విధానంపై ఆదివారం రైతులకు అవగాహన కల్పించారు. ఆవు మూత్రం 10 లీటర్లు, పొగాకు కిలో, వెల్లుల్లి అరకిలో, పచ్చిమిర్చి అరకిలో, వేపాకులు 5 కిలోలు ఒక మట్టి కుండలో వేసి పది లీటర గోమూత్రం వేసి బాగా కలిపి, దాన్ని మరగబెట్టిన తరువాత పలుచని గుడ్డలో వడకట్టి డబ్బాలో వేసి మూడు నెలల వరకు ఉపయోగించుకోవచ్చన్నారు. ఎకరానికి 5 లీటర్ల అగ్నిఅస్త్రం 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

శివోహం

- శివరాత్రి జాగరణ చేసిన భక్తులు
- శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు
- ఆలయాల వద్ద అన్నదానం



వేపాడ: కొండగుల్లులో బ్రహ్మలింగేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు శంకర్‌శర్మ



వేపాడ: కొండగుల్లు షిర్డీ సాయిబాబా ఆలయంలో పూజలు



వేపాడ: కొండగుల్లు వద్ద అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



బొండపల్లి: నెలివాడలో పూజలు చేస్తున్న భక్తులు

వేపాడ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో భక్తులు జాగరణ చేశారు. శనివారం అర్ధరాత్రి లింగోద్భవకాలంలో శనివారం అర్ధరాత్రి శివయ్యకు రుద్రాభిషేకం చేశారు. పాటూరు, బొద్దాం, బానాది, నల్లబిల్లి, సోంపురం, వల్లంపూడి, కొండగుల్ల శివాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు, అభిషేకాలు చేశారు. జాగరణ చేసిన భక్తులు మళ్లీ ఆదివారం ఉదయం స్వామివారిని దర్శించుకున్నారు. కొండగుల్ల బ్రహ్మలింగేశ్వరస్వా మి ఆలయం వద్ద శివరాత్రిని పురస్కరించుకుని, షిర్డీసాయిబాబా ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు.

శివాలయాలు కిటకిట..

బొండపల్లి: మహాశివరాత్రి జాగరణ చేసిన భక్తులతో మండలంలోని గెద్దపేట, బొండపల్లి, రాచకిండాం, నెలివాడ తదితర గ్రామాల్లోని శివాలయాలు ఆదివారం కిటకిటలాడాయి. భక్తులతో అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

దత్తసాయి మందిరంలో...

చీపురుపల్లి: మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా స్థానిక రుంకానవీధిలోని శ్రీ దత్తసాయి మందిరంలో శనివారం రాత్రి 8 నుంచి తెల్లవారు జామున 4 గంటల వరకు షిర్డీ సాయికు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, సుధారాణి దంపతులు 108 కిలోల విభూది, దత్తసాయి మందిర నిర్వాహకులు తంగుడు రామకృష్ణ దంపతులు 100 కిలోల విభూదిని స్వామి వారికి సమర్పించారు.



బొండపల్లి: గెద్దపేట శివాలయం వద్ద బారులు తీరిన భక్తులు



వేపాడ: బానాది శివాలయంలో రుద్రాభిషేకం



చీపురుపల్లి: షిర్డీసాయి మందిరంలో భక్తుల సందడి



వేపాడ: బొద్దాం ఉమాబ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు